# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME :132 EDITOR:CHERUKU UPENDAR, DATE : FRIDAY 22 SEPTEMBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 132 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : శుక్రవారం 22 సెప్టెంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-


## తెలంగాణలో మారిపోయిన వాతావరణం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. గడిచిన రెండు, మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరగ్గా తాజాగా వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. గురువారం తెల్లవారు జామున పలు చోట్ల భారీ వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లగా మారింది. బంగాళాఖాతంలో ఏర్పడిన



మిగతా 2లో...

### హైదరాబాద్‌కు చేరిన
## వన్డే ప్రపంచకప్ ట్రోఫీ
### నేడు చార్మినార్, ఉప్పల్‌లో ప్రదర్శన




హైదరాబాద్- ప్రభాత సూర్యుడు

ఐసిసి వన్డే ప్రపంచకప్ ట్రోఫీ బుధవారం హైదరాబాద్ చేరుకుంది. రామోజీ ఫిల్మ్ సిటీలో ఈ కప్పును ప్రదర్శించారు. గురువారం చార్మినార్, ఉప్పల్ క్రికెట్ మైదానంలో ప్రపంచకప్‌ను ప్రదర్శించనున్నారు. ప్రపంచకప్ విజేతలకు అందించే ఈ ట్రోఫీకి ఘన చరిత్ర ఉంది. 1999 ప్రపంచకప్ నుంచి ఇప్పుడున్న ట్రోఫినే విజేతలకు అందజేస్తున్నారు. ఛాంపియన్ జట్టుకు మొదట ఈ ట్రోఫీని ప్రదానం చేసి.. అనంతరం దీని నమూనాను ఇస్తున్నారు. నిజమైన ట్రోఫీ కింది భాగంలో విజేత జట్ల పేర్లను రాస్తున్నారు. ప్రస్తుత ట్రోఫీని లండన్‌లోని గరార్డ్ అండ్

మిగతా 2లో...

# అభివృద్ధి @హైదరాబాద్

- పారదర్శకంగా డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ
- బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలకు కూడా ఇచ్చాం
- అర్హులందరికీ ఇండ్లు ఇచ్చే బాధ్యత మాదే
- పేదల కోసం బ్రహ్మాండమైన ప్యాకేజీ..
- ఢిల్లీ, బెంగళూరు హామీలకు మోసపోవద్దు
- రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్
- దుండిగల్‌లో రెండో విడత డబుల్ ఇండ్ల పంపిణీ
- రూ.60 వేల కోట్ల విలువైన ఇండ్ల పంపిణీ



హైదరాబాద్- ప్రభాత సూర్యుడు

పేదలు, రైతుల కోసం బ్రహ్మాండమైన ప్యాకేజీ ఉండబోతున్నదని, త్వరలోనే సీఎం కేసీఆర్ ఆ విషయాలను ప్రకటిస్తారని పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ వెల్లడించారు. ఎన్నికల వేళ రాష్ట్రానికి విపక్ష నాయకులు క్యూ కడుతున్నారని, అడ్డగోలు హామీలు ఇస్తూ ప్రజలను బురిడీ కొట్టించాలని చూస్తున్నారని అన్నారు. ఢిల్లీ, బెంగళూరు నుంచి వచ్చి బూటకపు హామీలు ఇచ్చే వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్‌లో డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు పంపిణీ చేసి, మాట్లాడారు. తెలంగాణ సర్కారు ఏర్పడిన తర్వాతే రాష్ట్రంలో పేదలకు న్యాయం జరుగుతున్నదని, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని తెలిపారు. పేదలు, రైతులపైన కేసీఆర్ కన్నా అత్యంత ప్రేమ కలిగిన నాయకుడు దేశంలో ఎవరూ లేరని చెప్పారు. ప్రతిపక్ష నాయకులు పనితో గెలువలేక.. ఇది వరకు ఏం చేసి ంద్రో చెప్పలేక..

మిగతా 2లో...

## హస్తినలోనే లోకేష్



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఢిల్లీ వెళ్లి వారం దాటిపోయింది. రెండు, మూడు రోజుల్లో అక్కడ పనులన్నీ చక్క బెట్టుకుని మళ్లీ తిరిగి వస్తారని అనుకున్నారు. కానీ ఆయన తిరిగి రాలేదు. మరో వైపు ఏపీలో లోకేష్‌నూ అరెస్టే చేస్తామని వైసీపీ నేతలు ప్రచారం చేస్తున్నారు. లోకేష్ నూ అరెస్ట్ చేస్తే తదుపరి కార్యాచరణను టీడీపీ ఖరారు చేసుకుంది. నారా బ్రాహ్మణిని తెరపైకి తీసుకు వస్తున్నారు. రాజమండ్రిలో క్యాండిల్ ర్యాలీ సందర్భంగా ఆమె మాట్లాడిన మాటలు వైరల్ అయ్యాయి. యూత్ ఐకాన్ అవుతారని టీడీపీ నేతలు కూడా గట్టి నమ్మకం పెట్టుకున్నారు. నారా లోకేష్ ఢిల్లీలో పార్టీ అంతర్గ సమావేశాలు నిర్వహిస్తున్నారు. రాజకీయంగా ఎవరితోనూ చర్చలు జరపడం లేదు.
ప్రధాని మోదీ లేదా

మిగతా 3లో...

# తెలంగాణ బీజేపీలో రహస్య సమావేశాలు

హైదరాబాద్- ప్రభాత సూర్యుడు

తెలంగాణ బీజేపీలో నాయకత్వ మార్పు కూడా పరిస్థితుల్ని దారికి తీసుకురావడం లేదు. అసంతృప్తి వాదులు పెరిగి పోతున్నారు. కొంత మంది సైలెంట్ గా ఉంటూండగా.. మరికొంత మంది కాంగ్రెస్ నేతల్ని పొగడటం ప్రారంభించారు. రహస్య సమావేశాలు నిర్వహిస్తూ భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తున్నారు. అమిత్ షా పర్యటన తర్వాత కూడా అదే పరిస్థితి నెలకొంది. బీజేపీ తరపున పార్లమెంట్ అభ్యర్థులు అవుతారనుకుంటున్న కొంత మంది కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్న చర్చ జరుగుతోంది. మూడు రోజుల క్రితం బీజేపీలోని అసంతృప్త నేతలు మాజీ ఎంపీ వివేక్ ఫామ్ హౌస్‌లో సమావేశం అయ్యారని బీజేపీలో ఒక్క సారిగా పుకారు గుప్పు మంది. ఈ సమావేశానికి మాజీ ఎంపీలు కొండా విశ్వేశ్వరరెడ్డి, విజయశాంతి, రవీంద్రనాయక్, మాజీ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి, సీనియర్ నేతలు గరికపాటి రామ్మోహనరావు, చాడా సురేశ్‌రెడ్డిలు హాజరయ్యారని చెబుతున్నారు. బీజేపీ అధిష్టానం, రాష్ట్ర నాయకత్వం గత కొంతకాలంగా తమ పట్ల అనుసరిస్తున్న తీరుపై వీరంతా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కనీసం తమను పట్టించుకోవడం లేదని పార్టీలో ప్రాధాన్యం దక్కడం లేదని వారు భావిస్తున్నారు. బీజేపీ బీఆర్ఎస్‌కు దగ్గరవుతుండటంతో పాటు పార్టీలో బండి, ఈటల, కిషన్‌రెడ్డికే ప్రాధాన్యతనిస్తున్నారని అసంతృప్త నేతలు భావిస్తున్నారు. ఇదే విషయమై గతంలో కూడా ఈ సీనియర్లు తమ నిరసన గళాలను విప్పారు. అధిష్టానంతో తాడో పేడో తేల్చుకోవాలని భావించినా?

మిగతా 2లో...

### టీచర్స్ రిక్రూట్ మెంట్‌లో
## 51 శాతం మహిళలకే



హైదరాబాద్- ప్రభాత సూర్యుడు

తెలంగాణలో ఉపాధ్యాయ నియామకాలకు నిర్వహించనున్న టీచర్స్ రిక్రూట్ మెంట్ టెస్టులోని పోస్టుల్లో మహిళకు పెద్ద ఎత్తున కొలువులు దక్కబోతున్నాయి. స్త్రీలకు 33 శాతం రిజర్వేషన్లతో పాటు జిల్లాల వారీగా రోస్టర్ పపాయింట్లను రూపొందించడంతో.. అందులోనూ మహిళ రోస్టర్ మేరకే పోస్టులు ఉండడంతో.. 51 శాతానికి పైగా ఉద్యోగాలు వారికే కేటాయించారు. జిల్లాల వారీగా రోస్టర్ పాయింట్ల ప్రకారం మొదటి పోస్టు ఓసీ మహిళకు, రెండో పోస్టు ఎస్సీ మహిళకు వెళ్తుంది. అక్కడ రెండు పోస్టులు మాత్రమే ఉంటే.. ఆ రెండూ స్త్రీలకే వెళ్తాయి. తదుపరి రిక్రూట్ మెంట్ లో మరో రెండు పోస్టులు భర్తీ చేయాలనుకుంటే రోస్టర్ నుంచి మళ్లీ లెక్క మొదలవుతుంది. ప్రస్తుతం రాషఅ్రటంలో 5 వేల 89 ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి నవంబరు 20వ తేదీ నుంచి టీఆర్‌టీ నిర్వహించనున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ నెల 20వ తేదీ నుంచిదరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం అవుతుంది. ఈక్రమంలోనే మంగళ వారం జిల్లాల వారీగా... సామాజిక వర్గాలు, పురుషులు, మహిళల వారీగా పోస్టులను ఖరారు చేసి వాటిని పాఠశాల

మిగతా 2లో...

# 50 వేల కోట్లతో ట్రాన్స్ మిషన్ డిస్ట్రిబ్యూషన్

- ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనికతతోటే విద్యుత్ రంగంలో విజయాలు
- 18,567 మెఘావాట్లకు పెరిగిన విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం
- మంత్రి జగదీష్ రెడ్డి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఎఫ్. టి.సి.సి.ఐ ఆధ్వర్యంలో రెడ్ హిల్స్ ఫెడరేషన్ హౌజ్ లో జరిగిన పారిశ్రామిక వేత్తల ఇంటారాక్టివ్ సెషన్, ముఖ్య అతిథిగా మంత్రి జగదీష్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ఇంధన శాఖా కార్యదర్శి సునీల్ శర్మ తదితరులు పల్గోన్నారు. మంత్రి మాట్లాడుతూ 50 వేల కోట్లతో రాష్ట్రంలో విద్యుద్దీకరణ జరిగిందని వెల్లడించారు. తద్వారా 2014 తరువాత యావత్ భారత దేశంలోనే విద్యుత్ సరఫరా లో తెలంగాణా రాష్ట్రం రికార్డ్ సృష్టించిందని ఆయన పేర్కొన్నారు. బుధవారం రాత్రి హైదరాబాద్ లోని రెడ్ హిల్స్ ప్రాంతంలో ఉన్న ఫెడరేషన్ హౌస్ లో ఎఫ్.టి.సి.సి.ఐ ఆధ్వర్యంలో జరిగిన పారిశ్రామిక వేత్తల ఇంటారాక్టివ్ సెషన్ కు మంత్రి జగదీష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇంధన శాఖా ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ తదితరులు పాల్గొన్న ఈ సెషన్ కు ఎఫ్ టి సి సి ఐ అధ్యక్షుడు ప్రారంభోపన్యాసం చేశారు.అనంతరం తెలంగాణా రాష్ట్రం-ఇంధన రంగంలో భవిష్యత్ సవాళ్లు అన్న అంశంపై మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ 50 వేల కోట్లతో ట్రాన్స్ మిషన్ ,డిస్ట్రిబ్యూషన్ లు అభివృద్ధి పరచడం వల్లనే ఈ రోజు పారిశ్రామిక వేత్తలు సంబురాలు జరుపుకుంటున్నారన్నారు.అందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనికత విద్యుత్ సంస్థల




యాజామాన్యాలు,సిబ్బంది కృషి ఉందని ఆయన తేల్చిచెప్పారు. 2014 కు ముందు పారిశ్రామిక వేత్తలు ఎంత ధర అయినా చెల్లించి విద్యుత్ ను కొనుగోలు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ రోజు అందుకు భిన్నంగా ఉంది అంటే అది ముఖ్యమంత్రి కేసీఆర్ మహిమనేనని ఆయన కొనియాడారు.

అయితే అదే సమయంలో గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సెస్ పై ఒత్తిడి తెవొద్దని ఆయన పారిశ్రామిక వేత్తలకు సూచించారు. గ్రిడ్ తో నిమిత్తం లేకుండా అందులో రాత్రుళ్ళు విద్యుత్ సరఫరా అసంభవం అని ఆయన స్పష్టం చేశారు.ప్రభుత్వానికున్న సామాజిక బాధ్యతలు దృష్ట్యా ఇది ఆచరణాత్మకంగా సాధ్యం కాదని ఆయన తెలిపారు.ఈ సెషన్ లో పాల్గొన్న సుమారు 150 మంది పారిశ్రామిక వేత్తలు గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సిస్ పై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని వెల్లడించాలని కోరగా మంత్రి జగదీష్ రెడ్డి సున్నితంగా తిరస్కరిస్తూ ఈ విషయంలో వత్తిడి వలదని సరిపడా విద్యుత్ సరఫరా కు ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధంగా ఉందన్నారు.

### హైదరాబాద్‌కు చేరిన

## వన్డే ప్రపంచకప్ ట్రోఫీ

(మొదటిపేజీ తరువాయి)

కో అనే ఆభరణాల సంస్థ తయారుచేసింది. దీని తయారీలో బంగారం, వెండి ఉపయోగించారు. ఇది 60 సెంటీమీటర్ల ఎత్తుతో పాటు 11 కిలోల బరువు ఉంటుంది. ఏ కోణం నుంచి చూసినా ఒకేలా కనిపించడం దీని ప్రత్యేకత. మూడు వైపులా పొడుగ్గా ఉండే వెండి స్టంప్స్, బెయిల్స్ మీద బంగారు గ్లోబ్ రూపంలో బంతి పొదిగి ఉన్నట్లు ఉంటుంది. క్రికెట్లోని బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లను ఈ మూడు స్టంప్స్ ప్రతిబింబిస్తాయి. ఇక 1999 ప్రపంచకప్ ముందు నాలుగు రకాల ట్రోఫీలను మార్చారు. ఇంగ్లండ్‌లో జరిగిన తొలి మూడు (1975, 1979, 1983) ప్రపంచకప్‌ల్లోనూ ఒకే రకమైన ట్రోఫీని అందజేశారు. స్పాన్సర్‌షిప్ కారణంగా ప్రుడెన్షియల్ కప్‌గా వ్యవహరించిన ఇది చూడ్డానికి వింబుల్డన్ పురుషుల ట్రోఫీలాగా ఉండేది. తొలిసారి ఇంగ్లండ్ బయట 1987లో ప్రపంచకప్ నిర్వహించారు.

## తెలంగాణ బీజేపీలో రహస్య సమావేశాలు

(మొదటిపేజీ తరువాయి)

ఢిల్లీ పెద్దల జోక్యంతో అది అప్పటికి ఆగిపోయింది. కానీ ఇటీవల మారిన రాజకీయ పరిణామాలు, ముఖ్యంగా కాంగ్రెస్‌కు జోష్ పెరిగిందనే వాతావరణం ఏర్పడటంతో మళ్లీ ఈ సీనియర్లందరూ తమ భవిష్యత్ కార్యాచరణపై సమాలోచనలు జరిపినట్టు తెలిసింది. ఈ ఎనిమిది మందిలో ఐదారుగురిని వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థులుగా ప్రకటించాలని బీజేపీ భావించింది. ప్రస్తుతం వారు రహస్యంగా భేటీ కావటం, కాంగ్రెస్ వైపు చూస్తున్నారనే సంకేతాలతో కమలంలో కలకలం రేగుతోంది. సీడబ్ల్యూసీ భేటీ, విజయభేరి సభ కోసం మూడు రోజుల పాటు హైదరాబాద్ లో ఉన్న సోనియా దృష్టిలో పడేందుకు సీనియర్ నేత విజయశాంతి ప్రయత్నించారు. సోనియాగాంధీని వ్యక్తిగతంగా గౌరవిస్తానని ప్రకటించారు. విజయశాంతి ట్వీట్ చేయటం బీజేపీలో కీలక పరిమామాలకు దారి తీస్తోంది. గతంలో ఈటల రాజేందర్ కూడా అసంతృప్తిగా ఉన్నారన్న ప్రచారం జరుగుతోంది. బీజేపీ అవసరం బీఆర్ఎస్‌కు ఏర్పడేలా సీట్లు తెచ్చుకోవాలన్న టార్గెట్ మాత్రమే అమిత్ షా పెట్టినట్లుగా ప్రచారం జరుగుతూండటంతో.. బీఆర్ఎస్ ను ఓడించాలన్న తమ సంకల్పం నెరవేరదని.. కొంత మంది అసంతృప్తి చెందుతున్నారు. వీరు పార్టీ మారుతారా లేదా అన్నది క్లారిటీ రావాల్సి ఉంది.

## టీచర్స్ రిక్రూట్ మెంట్‌లో 51 శాతం మహిళలకే

(మొదటిపేజీ తరువాయి)

విద్యాశాఖ తమ వెబ్ సైట్ లో ఉంచింది. ఉపాధ్యాయ ఖాళీల సంఖ్య తక్కువగా ఉన్న జిల్లాల్లో మహిళలకు ఎక్కువ పోస్టులు ఉంటాయని విద్యాశాఖ వెల్లడించింది. మొత్తం 2 వేల 598 మంది మహిళలకు, 2 వేల 491 మంది పురుషులకు దక్కబోతున్నాయి. జనరల్ విభాగంలోనూ పురుషులతో మహిళలు పోటీ పడతారు. ఫలితంగా 55 నుంచి 60 శాతం ఉద్యోగాలను వారు సొంతం చేసుకోనున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 275 ఖాళీల్లో.. 135, నల్గొండ జిల్లాలో 219లో 104, అలాగే భువనగిరిలో 99కిగాను 55, కరీంనగర్ జిల్లాలో 99లో 44, జనగామ జిల్లాలో 76కుగాను 42, హనుమకొండ జిల్లాలో 54లో 35, పెద్దపల్లి జిల్లాలోలో 43లో 32 ఉద్యోగాలు మహిళలకే దక్కబోతున్నాయి. ప్రస్తుతానికి మహిళలకు సంబంధించి వర్టికల్ పద్ధతిలోనే రోస్టర్ ఉంటుందని పాఠశాల విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ఎంపిక నాటికి ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా వర్టికలా, హారిజాంటల్ విధానమా అన్నది తెలుస్తుందని చెబుతున్నారు. మొత్తం 2 వేల 575 మంది ఎస్జీటీ పోస్టుల్లో దాదాపు 2 వేల వరకు తెలుగు మాధ్యమానికి సంబంధించివే ఉన్నాయి. ఒక్క హైదరాబాద్ జిల్లాలోనే 40 ఎస్జీటీ ఆంగ్ల మాధ్యమం పోస్టులు ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్లలో బయాలజీ, సాంఘిక శాస్త్రం, తెలుగు సబ్జెక్టుల్లో ఎక్కువ ఉద్యోగాలు ఉన్నాయి. అలాగే అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో 36 కేటగిరీలు, జనగామలో 9 కేటగిరీల్లో కొలువులు ఉన్నాయి. ఎస్జీటీ తెలుగు, ఆంగ్లం, కన్నడం, తమిళం, ఉర్దూ, స్కూల్ అసిస్టెంట్లలో మాధ్యమాలు, సబ్జెక్టులు ఇలా ఉన్నాయి. ఉర్దూతో పాటు కన్నడం, తమిళం, మరాఠీ తదితర వాటిల్లో అధిక శాతం పోస్టులు భర్తీ కాకపోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈసారి మొత్తం 5 వేల 89 ఖాళీల్లో సుమారు 450 వరకు 2017 టీఆర్‌టీలో భర్తీ కానివే. అయితే ఈ పోస్టులనే క్యారీ ఫార్వర్డ్ చేశారు. ఈసారి కూడా అదే పరిస్థితి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. అలాగే తొలి సారిగా ఈడబ్ల్యూఎస్ కోటా అమలు చేస్తుండగా... అందులో పురుషులకు, మహిళలకు ఎన్నెన్ని కేటాయిస్తారో ఖరారు చేశారు. మొత్తం తెలంగాణలో ఉపాధ్యాయ ఖాళీల్లోల ఎస్జీటీ పోస్టు 2 వేల 575 ఉన్నాయి. అలాగే స్కూల్ అసిస్టెంట్లు వెయ్యి 739 ఉన్నాయి. 1739 స్కూల్ అసిస్టెంట్లు ఉండగా.. 611 భాషా పండితుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటితో పాటు 164 పీఈటీ (ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు) ఖాళీ పోస్టులు ఉన్నాయి.

## తెలంగాణలో మారిపోయిన వాతావరణం

(మొదటిపేజీ తరువాయి)

అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అల్పపీడనం ప్రస్తుతం వాయువ్య బంగాళాఖాతం సమీపంలోని పశ్చిమబంగ, ఒడిశా తీరాల్లో కనసాగుతోంది. అలాగే దీనికి అనుబంధంగా ఉన్న ఆవర్తనం సగటు సముద్ర మట్టం నుంచి 7.6 కి.మీల ఎత్తు వరకు వ్యాపించి ఉంది. ఆదిలాబాద్, కరీంనగర్, ములుగు, భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, సిద్దిపేట జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలోనే ఆయా జిల్లాలకు వాతావారణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఇక తెలంగాణ వచ్చే రెండు రోజులు కూడా ఓ మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతవరణ శాఖ పేర్కొంది.

# అభివృద్ధి @ హైదరాబాద్

(మొదటిపేజీ తరువాయి)

కొత్త రూపాల్లో వస్తున్నారని.. ఇష్టమొచ్చిన హామీలు ఇస్తున్నారని విమర్శించారు. వాళ్లు ఇచ్చిన దొంగ హామీలు నమ్మి మోసపోదామా? అని ప్రశ్నించారు. వాళ్లు చెప్పినదానికంటే ఎకువ సంక్షేమం చేయాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమని, ఆ దిశగా ఆలోచన చేస్తున్నారని తెలిపారు. ఆ విషయాలను అతి త్వరలోనే సీఎం కేసీఆర్ వెల్లడిస్తారని, ప్రజలు తొందరపడొద్దని సూచించారు. పనిచేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు.

**ప్రగతి రథ చక్రం ఆగొద్దు**

కొత్తగా రాష్ట్రం ఏర్పాటైనప్పటికీ ఈ తొమ్మిదేండ్లలో అభివృద్ధి, సంక్షేమంలో జోడెద్దుల్లా తెలంగాణ రాష్ట్రం ప్రగతి బాటలో ముందుకెళ్తున్నదని, ఈ ప్రగతి చక్రం ఆగొద్దంటే మళ్లీ పనిచేసే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని మంత్రి కేటీఆర్ ప్రజలను కోరారు. ఒకప్పుడు హైదరాబాద్‌లో ఏ బస్తీకి పోయినా మంచినీళ్ల కోసం లొల్లి ఉండేదని, ఖైరతాబాద్ జలమండలి ముందు ఎప్పుడు చూసినా ఖాళీ బిందెలు, ఖాళీ కుండలు పెట్టి ధర్నాలు చేసేవాళ్లని ఉమ్మడి పాలన తీరును ఎండగట్టారు. కరెంట్ విషయానికొస్తే అపార్ట్‌మెంట్ కిందకు వెళ్తే డీజిల్ కంపుతో ముకులు పగిలిపోయేవని, ఇన్వర్టర్లు, జనరేటర్లు లేకపోతే జ్యూస్ స్టాళ్లు, జిరాక్స్ సెంటర్లు నడుపుకోలేని దుస్థితి ఉండేదని గుర్తుచేశారు.

స్వరాష్ట్రంలో కరెంట్, నీటికష్టాలు శాశ్వతంగా దూరమయ్యాయని తెలిపారు. గణేశ్ పండుగ వచ్చిందంటే వారంపాటు కర్ఫ్యూ కంపల్సరీ ఉండేదని, ఇవాళ ఆ పరిస్థితులు ఉన్నాయా? అని మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు బాగున్నాయని, మంచినీళ్ల సౌలత్ మంచిగైందని, రోడ్లు బాగయ్యాయని, పేదలకు కడుపు నిండా పింఛన్ వస్తున్నదని, డబుల్ బెడ్రూం ఇండ్లు వస్తున్నాయని పేర్కొన్నారు. ఇన్ని పనులు చేసుకుంటూ ముందుకుపోతున్న ఈ ప్రగతి చక్రాలను ఆపేందుకు.. వాటికి అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికల ముందు కొంతమంది వచ్చి బూటకపు హామీలు ఇస్తున్నారని, అలాంటి వాళ్ల మాటలకు మోసపోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**అందరికీ ఇండ్లు ఇచ్చే బాధ్యత మాదే**

సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే పేదలకు న్యాయం జరుగుతున్నదని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. అర్హులైన వారందరికీ ఇండ్లు ఇచ్చే బాధ్యత తమదేనని స్పష్టం చేశారు. భవిష్యత్తులో అందరికీ ఇండ్లు ఇచ్చేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఒకేసారి అందరికీ ఇండ్లు ఇవ్వాలని తమకు కూడా ఉన్నదని, కానీ మధ్యలో రెండేండ్లు కరోనాలాంటి సంక్షోభం, దానివల్ల ఆర్థిక పరిస్థితి కూడా దెబ్బతిన్నదని వివరించారు. అయినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఉండే రైతులకు రెండుసార్లు రుణమాఫీ చేసుకున్నామని, రైతు బంధు కింద రూ. 73 వేల కోట్లు రైతుల ఖాతాలో వేస్తున్నామని చెప్పారు. దళిత బంధువంటి విప్లవాత్మక పథకం తెచ్చి దళితోద్ధరణలో భారతదేశానికే ఆదర్శంగా నిలిచామని చెప్పారు. పారిశ్రామికీకరణ, కొత్త పరిశ్రమలు ఆకర్షించడంలోనూ ముందున్నామని, త్వరలో దుండిగల్‌కు కూడా కొత్త పరిశ్రమను తీసుకురా బోతున్నామని తెలిపారు. ఈ ప్రాంతం రూపురేఖలు తప్పకుండా మారుస్తామని స్పష్టం చేశారు.

తెలంగాణకు సీఎం కేసీఆర్ శ్రీరామరక్ష అని, కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి మరోసారి రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకురావాలని మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు, కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి లాస్య నందితను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్సీలు కుర్మయ్యగారి నవీన్‌కుమార్, శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు వివేకానంద, మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు ముద్దం నర్సింహయాదవ్, మందాడి శ్రీనివాస్, ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీశ్‌గౌడ్, కంటోన్మెంట్ నియోజవకర్గ బీఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత, మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, కలెక్టర్లు అనుదీప్, హరీశ్, అమోయ్‌కుమార్, జోనల్ కమిషనర్ మమత, మేడ్చల్ జిల్లాకు చెందిన కౌన్సిలర్లు, చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

**పారదర్శకతకు ఇదే నిదర్శనం**

ఒక్క రూపాయి కూడా లంచం ఇవ్వాల్సిన అవసరం లేకుండా.. ఎవరి ప్రమేయం లేకుండా లబ్ధిదారులకు ఉచితంగా డబుల్ బెడ్రూం ఇండ్లను అందిస్తున్నామని మంత్రి కేటీఆర్ తెలిపారు. లబ్ధిదారుల ఎంపికను అత్యంత పారదర్శకంగా కంప్యూటర్ ప్రోగ్రాం ఆధారంగా పూర్తి చేస్తున్నట్టు చెప్పారు. లబ్ధిదారుల ఎంపికలో ప్రజాప్రతినిధుల పాత్ర లేదని తేల్చి చెప్పారు. పేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లు అందితే చాలు అన్న కేసీఆర్ మార్గదర్శనం మేరకు పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నట్టు మంత్రి కేటీఆర్ వివరించారు. లబ్ధిదారుల జాబితాలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు కూడా ఉన్నారని మంత్రి కేటీఆర్ తెలిపారు. జగద్గిరిగుట్ట డివిజన్ (వార్డు నంబరు 126) కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు కౌసల్యకు మొదటి విడతలో డబుల్ బెడ్రూం ఇల్లు వచ్చిందని.. అదే డివిజన్‌లోనే బీజేపీ నాయకురాలు సునీతకు కూడా మొదటి విడతలోనే ఇల్లు వచ్చిందని వివరించారు.

**మోదీపై కేటీఆర్ సెటైర్**

లబ్ధిదారులకు ఇండ్ల పట్టాల పంపిణీ సందర్భంగా మంత్రి కేటీఆర్ ప్రధాని మోదీపై పరోక్షంగా సెటైర్ వేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన ఓ మహిళ ఇండ్ల పట్టా అందుకుంటున్న సందర్భంగా ఏం చేస్తావని కేటీఆర్ ప్రశ్నించగా.. చాయ్ అమ్ముకుంటానని ఆమె బదులిచ్చారు. దీంతో చాయ్ అమ్ముకొనే వాళ్లు దేశాన్ని మోసం చేయొద్దని కేటీఆర్ అన్నారు. అనంతరం 'నీ గురించి అనలేదు.. కంగారుపడొద్దు' అని సదరు మహిళకు సూచించారు. చాయ్ అమ్మి దేశాన్ని మోసం చేసే వాళ్ల గురించి అన్నానని చెప్పుకొచ్చారు. ప్రధాని మోదీపై కేటీఆర్ వేసిన సెటైర్‌కు సభికులంతా చప్పట్లతో హర్షాతిరేకాలు వ్యక్తం చేయడం విశేషం.

**పేదల చేతిలో రూ.60 వేల కోట్ల విలువైన ఆస్తి**

'ఇల్లుకట్టి చూడు.. పెండ్లి చేసి చూడు' అని గతంలో పెద్దలు అనేవారని, కానీ ప్రస్తుతం సీఎం కేసీఆర్ మాత్రం 'ఇల్లు నేనే కట్టిస్తా..పెండ్లి నేనే చేయిస్తా' అంటున్నారని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. దేశంలోనే అతిపెద్ద మురికివాడల అభివృద్ధి కార్యక్రమంగా డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం నిలుస్తుందని తెలిపారు. పేదలకు ఉచితంగా ఇండ్లు కట్టించి ఇస్తున్న బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏ రాష్ట్రంలో అయినా ఉన్నదా? అని ప్రశ్నించారు. హైదరాబాద్ నగరంలో కట్టిన లక్ష డబుల్ బెడ్రూం ఇండ్ల విలువ రూ. 9,700 కోట్ల పైమాటేనని, ప్రభుత్వం కట్టిన ఈ డబుల్ బెడ్రూం ఇండ్లు మార్కెట్ విలువ రూ. 50 వేల కోట్ల నుంచి 60 వేల కోట్ల వరకు ఉంటుందని చెప్పారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఉచితంగా రూ. 60 వేల కోట్ల విలువైన ఆస్తులను పేదల చేతిలో పెడుతున్నదని తెలిపారు. ఇప్పటివరకూ లబ్ధిదారులకు 30 వేల ఇండ్లు అందించామని, మిగిలిన 70 వేల ఇండ్లను త్వరలోనే అందజేస్తామని చెప్పారు. ఇంతపెద్ద డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణ కార్యక్రమాన్ని పూర్తి చేసిన జీహెచ్ఎంసీ అధికారులకు, అత్యంత పారదర్శకంగా ఇండ్లు పంపిణీ చేస్తున్న మేడ్చల్–మల్కాజ్‌గిరి, హైదరాబాద్, రంగారెడ్డి కలెక్టర్లకు ఈ సందర్భంగా కేటీఆర్ అభినందనలు తెలిపారు.

### కొల్లూరులో రెండో విడత

## డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

టాన్‌చెరు పరిధిలోని కొల్లూరులో రెండో విడత డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీని మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని... ఈ విషయం రజనీకి అర్థమైంది కానీ.. గజనీలకు మాత్రం కావట్లేదని విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇండ్లు కట్టడం అంటే అప్పుల్లో కూరుకుపోవడమే అన్నట్లుగా ఉండేదన్నారు. మహిళల కోసం సీఎం కేసీఆర్ చాలా పథకాలు తీసుకొచ్చారని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ కిట్లు ఇస్తే.. ప్రతిపక్షాలు తిట్టిపోస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ధర్నాలు తప్ప ఏమీ జరగలేదన్నారు. గోదావరి, కృష్ణా జలాలను తీసుకొచ్చి హైదరాబాద్‌లో తాగునీటి కొరతను సీఎం కేసీఆర్ తీర్చారని మంత్రి హరీశ్‌రావు చేశారు. 60 ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు ఈ పని చేయలేకపోయాయని అన్నారు. పేదలందరికీ ఉచితంగా మంచినీటిని బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇండ్లు కట్టడం అంటే అప్పుల్లో కూరుకుపోవడమే అన్నట్లుగా ఉండేదన్నారు. మహిళల కోసం సీఎం కేసీఆర్ చాలా పథకాలు తీసుకొచ్చారని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ కిట్లు ఇస్తే.. ప్రతిపక్షాలు తిట్టిపోస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ధర్నాలు తప్ప ఏమీ జరగలేదని గుర్తు చేశారు.

త్బుల్లాపూర్, దుండిగల్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ, ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పురపాలక శాఖ మంత్రి కే. తారకరామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ హైదరాబాద్ నగరంలో కట్టిన లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల విలువ 9700 వేల కోట్ల పైననే అన్నారు. కానీ మేము కట్టిన ఈ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల మార్కెట్ విలువ 50 నుంచి 60 వేల కోట్ల రూపాయలు ఉంటుందన్నారు మంత్రి కేటీఆర్. ఒక్క రూపాయి లంచం ఇవ్వాల్సిన అవసరం లేకుండా ఎవరి ప్రమేయం లేకుండా లబ్ధిదారులకు ఉచితంగా అందిస్తున్నామన్నారు మంత్రి కేటీఆర్. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికను అత్యంత పారదర్శకంగా కంప్యూటర్ ప్రోగ్రామ్ ఆధారంగా పూర్తి చేయడం జరుగుతున్నదని, లబ్ధిదారుల ఎంపికలు ప్రజాప్రతినిధుల పాత్ర లేదు. పేదలకి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అందితే చాలు అన్న కెసిఆర్ గారి మార్గదర్శనం మేరకు పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు మంత్రి కేటీఆర్. లబ్ధిదారుల జాబితాలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు కూడా ఉన్నారని, ఈరోజు 8 చోట్ల 13 వేలకు పైగా ఇండ్లను ఒక్కరోజే లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు కేటీఆర్. అంతేకాకుండా.. 'ఈరోజు జరిగిన ఇండ్ల పంపిణీ కార్యక్రమంతో దాదాపు 30 వేల ఇండ్లు లబ్ధిదారులకు అందించడం జరిగింది. మిగిలిన 70 వేల ఇళ్లను కూడా త్వరలో లబ్ధిదారులకు అందిస్తాం. ఒక్క లబ్ధిదారుడైన ఒక్క రూపాయి లంచం ఇచ్చే పరిస్థితి ఉంటే నేరుగా అధికారులకు కానీ ప్రజాప్రతినిధులకు కానీ చెప్పాలి. భారతదేశంలో ఇంకా ఎక్కడైనా ఇంత పెద్ద పక్క డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టి పేదలకు ఇస్తున్న ప్రభుత్వం ఏదైనా ఉందా. పేదలకు ఉచితంగా ఇండ్లు కట్టించి ఇస్తున్న బిజెపి కాంగ్రెస్ ప్రభుత్వం ఏ రాష్ట్రంలో అయినా ఉన్నదా. దేశంలోనే అతిపెద్ద మురికివాడల అభివృద్ధి కార్యక్రమంగా ఈ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం నిలుస్తుంది. ఇంత పెద్ద డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ కార్యక్రమాన్ని పూర్తి చేస్తున్న జిహెచ్ఎంసి అధికారులకు అభినందనలు. కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే పేదలకు న్యాయం జరుగుతున్నది. వారి జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయి. పేదల పైన, రైతుల పైన కెసిఆర్ కన్నా అత్యంత ప్రేమ కలిగిన నాయకుడు దేశంలో ఎవరూ లేరు. పనిచేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజలను కోరుతున్నాను. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందించలేని కొన్ని పార్టీలు ఈరోజు అడ్డగోలు వాగ్దానాలు చేస్తున్నాయి. ఢిల్లీ నుంచి, బెంగళూరు నుంచి వచ్చి అడ్డగోలు వాగ్దానాలు చేస్తున్న వారి మాటలు నమ్మాల్సిన అవసరం లేదు. సంక్రాంతికి ముందు గంగిరెద్దులు వచ్చినట్లు ఎన్నికల ముందు వచ్చి బూటకపు హామీలు ఇచ్చే వారి పట్ల జాగ్రత్తగా ఉండాలి.' అని మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు ప్రభుత్వం ఫెయిల్

డబుల్ ఇండ్లపై మంత్రి కేటీఆర్ కు బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ కౌంటర్. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూం ఇండ్ల రెండో విడుత పంపిణీ జరిగిందని, కేటీఆర్.. ఈ కార్యక్రమంలో ఏదేదో మాట్లాడారన్నారు ఎమ్మెల్యే రాజాసింగ్. మీరు తెలంగాణలో ఎంతమందికి ఇండ్లు ఇస్తున్నారని ప్రశ్నించిన రాజాసింగ్.. కేటీఆర్.. నీకు ఆ డేటా అసలు తెలుసా అన్నారు. ఒకసారి తెలుసుకోండని, 2.16 లక్షల ఇండ్లు కట్టినట్లు గూగుల్ ద్వారా తెలిసిందన్నారు. కానీ లక్ష ఇండ్లు కూడా కట్టలేదని ఆయన హెద్దేవ చేశారు. తెలంగాణ ప్రజలు ఇండ్లు కావాలని అంటున్నారని, మీరు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తారా? సింగిల్ బెడ్రూం ఇస్తారా? అనేది ప్రజలకు అనవసరం అని, మీరు మంచి చేస్తే ప్రజలు మీకే ధన్యవాదాలు చెబుతారన్నారు ఎమ్మెల్యే రాజాసింగ్. 25 లక్షల మందకి పైగా ప్రజలు ఇండ్లు లేవని దరఖాస్తు చేసుకున్నారని, అందులో ఎంతమందికి కేసీఆర్ సర్కార్ ఇండ్లు ఇస్తుందో చెప్పాలన్నారు రాజాసింగ్. ఇతర రాష్ట్రాల్లో ఇలాంటి ఇండ్లు ఎక్కడా కట్టలేదని కేటీఆర్ చెబుతున్నారని, యూపీలో సింగిల్ బెడ్రూం ఇండ్లు 15.70 లక్షల ఇండ్లు, మధ్యప్రదేశ్ లో 7 లక్షల 80 వేల ఇండ్లు, మహారాష్ట్రలో 11 లక్షల 70 వేల ఇండ్లు, గుజరాత్ లో 6 లక్షల 40 వేలు, హర్యానా 2 లక్షల 65 వేల ఇండ్లు, అస్సాంలో 1 లక్ష 55 వేల ఇండ్లు కట్టించి ఇచ్చారన్నారు. రెంట్ కట్టి కట్టి, గుడిసెలో ఉండి ఇబ్బందులు పడుతున్నారని, సింగిల్ బెడ్రూం ఇండ్లు అయినా ఇవ్వండని ప్రజలు మొత్తుకుంటున్నారన్నారు. తెలంగాణలో షోప్ టాప్ తప్పితే.. ఇండ్లు కూడా ఇవ్వడంలేదు.. కట్టి వదిలేస్తున్నారని, డబుల్ బెడ్రూం ఇండ్లు మీరు ఎన్ని కడుతారో కట్టి ఇవ్వండి.. దాంతో పాటు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింది సింగిల్ బెడ్రూం ఇండ్లయినా కట్టించి ఇవ్వండి అని రాజాసింగ్ వ్యాఖ్యానించారు.

## సంపాదకీయం

# నెరవేరిన 3 దశాబ్దాల కల

మహిళా రిజర్వేషన్ బిల్లు (నారీ శక్తి వందన్ చట్టం బిల్లు) లోక్‌సభ ఆమోదం పొందింది. బిల్లుపై ఓటింగ్ స్లిప్ ద్వారా జరిగింది. బిల్లుకు అనుకూలంగా 454 ఓట్లు రాగా, వ్యతిరేకంగా రెండు ఓట్లు పోలయ్యాయి. ఓటింగ్ సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఉన్నారు.మూడింట రెండొంతుల మెజారిటీతో బిల్లు ఆమోదం పొందిందని లోక్‌సభ స్పీకర్ వెల్లడించారు. కొత్త పార్లమెంట్ లో ఆమోదం పొందిన తొలి బిల్లు ఇదే. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా పలువురు నేతలు ఇది చారిత్రాత్మక ఘట్టమన్నారు. నారీ శక్తి వందన్ బిల్లు' లోక్‌సభలో ఆమోదం పొందడంతో దేశప్రజలకు అభినందనలు తెలిపారు. బిల్లు ఆమోదం పొందిన తర్వాత ప్రధాన మంత్రి మోడీ ట్వీట్ చేశారు. ఎంపీలందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. మహిళా కోటా బిల్లు ఆమోదం పొందడం పట్ల సంతోషంగా ఉందని, సహకరించిన ఎంపీలకు పార్టీలకతీతంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని మోడీ తెలిపారు. నారీ శక్తి వందన్ బిల్లు ఒక చారిత్రాత్మక చట్టం, ఇది మహిళా సాధికారతను మరింత పెంపొందిస్తుందన్నారు. రాజకీయ ప్రక్రియలో మహిళలు మరింత ఎక్కువ భాగస్వామ్యం అయ్యేందుకు బిల్లు అవకాశం కల్పిస్తుందని మోడీ తెలిపారు. మరోవైపు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ట్వీట్ చేశారు. నారీ శక్తి వందన్ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందిందని, ఇది మన దేశానికి చారిత్రాత్మకమైన ముందడుగు అని అన్నారు. ప్రధాని మోడీ ఊహించిన బిల్లు మహిళా సాధికారత చరిత్రలో కొత్త అధ్యాయం అన్నారు. సమానమైన, లింగ-సమగ్ర అభివృద్ధిని బిల్లు ప్రోత్సహిస్తుందన్నారు. మహిళల నేతృత్వంలోని పాలనకు మోడీ ప్రభుత్వ చిత్తశి?ద్ధితో పని చేస్తుందన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై మాన్యువల్ పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. ఎరుపు, ఆకుపచ్చ స్లిప్పులను సభ్యులందరికీ అందజేశారు. అనంతరం ఓటింగ్ జరిగే ప్రక్రియపై లోకసభ సెక్రటరీ జనరల్ సభ్యులకు వివరించారు. బిల్లుకు మద్దతు తెలిపినట్లయితే 'ఎస్' అని ఆకుపచ్చ స్లిప్పుపై రాయాలి. వ్యతిరేకిస్తే ఎరుపు స్లిప్పుపై 'నో' అని రాయాలని చెప్పారు. అనంతరం ఓటింగ్ నిర్వహించారు. రాజ్యాంగ సవరణ కూడా ఉండటంతో మాన్యువల్ పద్ధతిలో ఓటింగ్ చేపట్టారు. ఓటింగ్‌కు కొద్దిసేపటి ముందు ప్రధాని మోడీ సభలోకి వచ్చారు.కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ, సోనియా గాంధీ, మహువా మోయిత్రా, కనిమోళి, సుప్రియా సూలే, నవనీత్ కౌర్ సహా 60 మంది సభ్యులు 'నారీ శక్తి వందన్ బిల్లు'పై చర్చలో పాల్గొన్నారు. చర్చ సందర్భంగా కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్, రాణి దుర్గావతి, రాణి చెన్నమ్మ, రాణి అహల్యాబాయి, రాణి లక్ష్మి వంటి నాయికల గురించి ప్రస్తావించారు. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే రాజ్యాంగ (నూట ఇరవై ఎనిమిదవ సవరణ) బిల్లు, 2023పై గురువారం రాజ్యసభలో చర్చ జరిగింది. రాజ్యసభలో ఈ బిల్లుపై చర్చకు ఏడున్నర గంటల సమయం కేటాయించారు. విపక్షాలు కూడా ఈ బిల్లుకు మద్దతు తెలుపుతుండటంతో అక్కడ సైతం ఇది ఆమోదం పొందంది. ఉభయ సభల ఆమోదం పొందడంతో.. మూడు దశాబ్దాల ప్రయత్నం ఫలించింది. చాలా ప్రతిపక్ష పార్టీలు బిల్లుకు మద్దతు ఇచ్చాయి. వెంటనే దీనిని అమలు చేయాలని.. ఒ॥బి॥ కోటాను చేర్చాలని డిమాండ్ చేశాయి. ఇది ఒక పెద్ద అడుగు అని పేర్కొన్న ప్రభుత్వం, జనాభా లెక్కలు, డీలిమిటేషన్ అవసరమని పేర్కొంది.బిల్లుపై చర్చ సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా, స్మృతి ఇరానీ, అర్జున్ మేఘవాల్, ఇతర నేతలు విపక్షాల వాదనలపై స్పందించారు. ప్రతిపక్షం వైపు కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ చర్చను ప్రారంభించారు. దీని తరువాత, ఎన్‌సిపి ఎంపి సుప్రియా సూలే, సమాజ్‌వాదీ పార్టీ ఎంపి డింపుల్ యాదవ్, డిఎంకె ఎంపి కనిమొళి, టిఎంసి ఎంపి మహువా మొయిత్రా సహా చాలా మంది మహిళా ప్రతిపక్ష ఎంపిలు ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకున్నారు.ఈ బిల్లులో ఓబీసీలు, ముస్లింలకు రిజర్వేషన్లు లేనందున ఈ బిల్లుకు మద్దతివ్వకూడదని కొందరు సోషల్ మీడియాలో చెబుతున్నారు. మీరు ఈ బిల్లుకు మద్దతివ్వకపోతే, రిజర్వేషన్లు త్వరలో జరుగుతాయా? ఈ బిల్లుకు మద్దతిస్తే కనీసం గ్యారెంటీ అయినా ఇస్తామన్నారు.రాహుల్ గాంధీని ఉద్దేశించి అమిత్ షా మాట్లాడుతూ, "ఓబీసీ రిజర్వేషన్లు, డిలిమిటేషన్ సమస్య లేదా జనాభా లెక్కల గురించి ప్రశ్నలు తలెత్తుతున్నాయి, వాటన్నింటికీ నేను సమాధానం ఇస్తాను.. అన్నింటిలో మొదటిది, ప్రస్తుత రాజ్యాంగంలో మూడు రకాల ఎంపీలు ఉన్నారు, వారు వచ్చారు. జనరల్, ఎస్సీ, ఎస్టీ కేటగిరీల నుంచి ఈ మూడు కేటగిరీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాం? ఇప్పుడు మూడొంతుల సీట్లు రిజర్వ్ చేయాలంటే ఆ సీటు ఎవరు నిర్ణయిస్తారు.. మేం చేయాలా.. వాయనాడ్ వస్తే.. రిజర్వు చేస్తే మేం రాజకీయం చేశామని మీరు చెబుతారు.రాహుల్ గాంధీని ఉద్దేశించి అమిత్ షా మాట్లాడుతూ.. ప్రభుత్వాన్ని కార్యదర్శులు నడుపుతున్నట్లు భావిస్తున్నారని అన్నారు. కేబినెట్ ఆధ్వర్యంలో ప్రభుత్వం నడుస్తోంది. దేశాన్ని నడిపే వ్యక్తుల్లో ఓబీసీలు ముగ్గురే ఉన్నారని అన్నారు. దేశాన్ని ప్రభుత్వం నడుపుతుందని నేను అంటున్నాను. దేశ విధానాలను మంత్రివర్గం నిర్ణయిస్తుంది. ఈ దేశ పార్లమెంట్ అది చేస్తుంది. బీజేపీలో 29 శాతం ఎంపీలు ఓబీసీకి చెందిన వారే. 85 మంది ఎంపీలు ఓబీసీకి చెందిన వారు. మీరు పోల్చాలనుకుంటే, చేయండి. 29 మంది మంత్రులు ఓబీసీకి చెందిన వారు. ఓబీసీ నుంచి ప్రధానమంత్రిని ఇచ్చాం.

## 25 వరకు ఓవర్సీస్ స్కాలర్షిప్ దరఖాస్తు గడువు పొడిగింపు

**పెద్దపల్లి- ప్రభాత సూర్యుడు :** ఈనెల 25 వరకు ఓవర్సీస్ స్కాలర్షిప్ దరఖాస్తు గడువు ఉందని, ఆసక్తి, అర్హత విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మొహమ్మద్ మేరాజ్ మహ్మూద్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర మైనారిటీస్ సంక్షేమ శాఖ డైరెక్టర్ కమీషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని పేద మైనారిటీ విద్యార్థులకు ముఖ్య మంత్రి ఓవర్సీస్ పథకం కింద స్కాలర్షిప్ ఆర్థిక సహాయం కోసం విదేశాలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ చేయుటకు ఇంజనీరింగ్ లో 60 శాతం, డాక్టరేట్ చేయుటకు పీజీలో 60 శాతం మార్కులు వచ్చి 2023 జనవరి ఒకటి నుంచి 31 జూలై వరకు విదేశాలలో విశ్వ విద్యాలయాలలో అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులు ఆర్థిక సహాయం కొరకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. సంవత్సర ఆదాయం 5 లక్షల లోపు ఉండాలని, అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, కెనడా సింగపూర్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, న్యూజిలాండ్, దక్షిణకొరియా, మొదలగు దేశాల్లోని విశ్వ విద్యాలయాల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులు సెప్టెంబర్ 25 సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఆన్లైన్ లో సమర్పించిన దరఖాస్తును ఒరిజినల్ తో సహా మూడు జతల జిరాక్స్ ప్రతులతో సెప్టెంబర్ 30 లోపు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని, ఆసక్తి, అర్హత గలవారు సద్వినియోగం చేసుకోవాలని మొహమ్మద్ మేరాజ్ మహ్మూద్ ఆ ప్రకటనలో తెలిపారు.

# రైతులకు రుణమాఫీ లబ్ది జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు

### జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా

**జగిత్యాల- ప్రభాత సూర్యుడు**




రైతులకు రుణమాఫీ ప్రక్రియ వేగవంతంగా పూర్తీ చేసి లబ్ది జరిగేలా చూడలని, సకాలంలో లక్ష్యాలను పూర్తీ చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా అన్నారు. గురువారం సమీకృత జిల్లా అధికారుల సముదాయాల సమావేశ మందిరంలో వ్యవసాయ రుణాలు, క్రాప్ లోన్లు, రైతు రుణ మాఫీ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ బ్యాంకర్లతో జిల్లా స్థాయి సమీక్ష కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటి వరకు లక్షా 20 వేల రూపాయల రుణ పరిమితి ఉన్న రైతులకు లక్ష రూపాయల పంట రుణమాఫీ చేసారని తెలిపారు. రుణమాఫీ జరిగిన రైతులకు నూతన రుణాల మంజూరు పై ఎస్.ఎల్.బీ.సి లో బ్యాంకర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని, సెప్టెంబర్ చివరి వరకు రుణమాఫీ జరిగిన ప్రతి రైతుకు నూతన రుణాల అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రుణమాఫీ జరిగిన ప్రతి రైతుకు నూతన రుణం అందే విధంగా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బ్యాంకర్లకు తెలిపారు. రుణమాఫీ ప్రక్రియ సంబంధించి సాంకేతిక సమస్యలు కారణంగా లబ్ది పొందని రైతులలో ఇతర బ్యాంకు ఖాతా వివరాలు లభించని జాబితా పంపామని, వ్యవసాయ విస్తరణ అధికారులచే ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి విచారణ పూర్తి చేసి సదరు రైతులకు కూడా రుణమాఫీ అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనవసరమైన కారణాలు తెలిపి రైతుల ఖాతాలలో ఉన్న నగదును హోల్డ్ లో ఉంచకూడదని కలెక్టర్ బ్యాంకర్లకు తెలిపారు.రైతు రుణమాఫీ సంబంధించి చివరి రైతు వరకు లబ్ది చేకూరే విధంగా చర్యలు తీసుకోవాలని, బ్యాంకర్లు వద్ద నుంచి గ్రామం వారీగా రుణమాఫీ సమాచారం సేకరించి వ్యవసాయ విస్తరణ అధికారులచే క్షేత్రస్థాయిలో ప్రతి రైతు రుణ మాఫీ లబ్ది పోందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ ప్రక్రియలో ధరణి కూడా ఒక భాగమే అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వెరిఫికేషన్ మాత్రమే చేస్తారని, మిగతా వివరాలు బ్యాంకు అధికారులు మాత్రమే తెలపాల్సి ఉంటుందని ఆమె అన్నారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకట్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి సురేష్, ఎస్.సి.కార్పోరేషన్ ఈ.డి.లక్ష్మి నారాయణ, వ్యవసాయ అధికారులు, బ్యాంకు అధికారులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# హస్తినలోనే లోకేష్

(మొదటిపేజీ తరువాయి)

హోంమంత్రి అమిత్ షాలను కలిసే ప్రయత్నం చేయలేదు. కానీ తమ పార్టీకి మద్దతు తెలుపుతున్న వారికి మాత్రం సమయం ఇస్తున్నారు. బీజేడీ, శివసేన, హర్యానా డిప్యూటీ సీఎం వంటి వారు వచ్చి లోకేష్‌కు సంఘీభావం చెబుతున్నారు. ఢిల్లీ వెళ్లిన మొదటి రెండు రోజులు జాతీయ మీడియాలకు ఇంటర్వ్యూలు ఇచ్చారు. అయితే లోకేష్ న్యాయపరమైన అంశాల్లో చురుగ్గా ఉన్నారని అంటున్నారు. వ్యక్తిగత పనులపై విదేశాల్లో ఉన్న ప్రముఖ లాయర్ హరీష్ సాల్వేను చంద్రబాబు కేసులో వాదించేందుకు ఆయన ఒప్పించారని చెబుతున్నారు. చంద్రబాబును సుదీర్ఘంగా జైల్లో ఉంచే కుట్రను ప్రణాళిక ప్రకారం చేస్తున్నారని లోకేష్ భావిస్తున్నారు. ఈ అంశంపై స్పష్టత ఉండటంతో న్యాయపరంగా పూర్తి స్థాయిలో ఎదుర్కొనేందుకు ఢిల్లీ కేంద్రంగా ఆయన ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారని అంటున్నరు. ఇప్పటికే క్వాష్ పిటిషన్ విచారణలో ఉంది. ఆ పిటిషన్ పై హైకోర్టులో ఆశించిన తీర్పు రాకపోతే వెంటనే సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు ఢిల్లీలో ఉండి ఏర్పాట్లు చేస్తున్నట్లుగా చెబుతున్నారు. ఏసీబీ కోర్టులో దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ పై విచారణ పూర్తయింది. క్వాష్ పిటిషన్ పై వ్యతిరేక తీర్పు వస్తే.. ఏసీబీ కోర్టులో కూడా బెయిల్ పై అనుకూల తీర్పు వస్తుందని టీడీపీ నేతలు అనుకోవడం లేదు. అందుకే.. వెంటనే సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు ..అన్ని ఏర్పాట్లు చేసుకున్నారని అంటున్నారు.చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేశారని .. ప్రజాస్వామ్య వ్యవస్థలోనే అత్యంత దారుణమైన సంస్కృతి తీసుకు వచ్చారని ఇలాంటి ప్రమాదక పరిస్థితులు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తాయని లోకేష్ ఢిల్లీలో రాజకీయ పార్టీలన్నింటికీ వివరించే ప్రయత్నం చేస్తున్నారు. ఏపీలో సీఎం జగన్ అధికారం చేపట్టినప్పటి నుండి ఉన్న పరిస్థితులు... ఇతర అంశాలపై వివరిస్తున్నారు. చంద్రబాబు అరెస్ట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తప్పు చేసిందని నిరూపించేలా న్యాయప్రక్రియను పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలని అనుకుంటున్నారు. ఆ తర్వాతే ఢిల్లీ నుంచి రావాలని అనుకుంటున్నారు. ఆ తర్వాత లోకేష్ కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

# గడువు తేదిలోగా సీఎంఆర్ చెల్లింపులు పూర్తి చేయాలి

### అదనపు కలెక్టర్ బి.ఎస్. లత

**జగిత్యాల- ప్రభాత సూర్యుడు**




గడువు తేదిలోగా సీఎంఆర్ చెల్లింపులు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ బి.ఎస్. లత అధికారులను ఆదేశించారు..గురువారం సమీకృత జిల్లా అధికారుల సముదాయాల భవనంలోని సమావేశం మందిరంలో వానకాలము 2021-22, యాసంగి 2021-22 మరియు వానాకాలము 2022-23 కి సంబందించిన సీఎంఆర్ చెల్లింపులలో పురోగతి తక్కువ ఉన్న రైస్ మిల్లర్లతో సమీక్షా సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలం 2022-23 సీఎంఆర్ చెల్లింపులలో పురోగతి తక్కువగా ఉన్నందున ప్రభుత్వం నిర్దేశించిన 30.09.2023 గడువు తేదిలోగా సీఎంఆర్ చెల్లింపులు పూర్తి చేయాలని, వానాకాలం 2021-22, యాసంగి 2021-22 సీజన్ లకు సంబంధించిన బకాయిలు త్వరితగతిన చెల్లించాలని ఆదేశించారు.. తదుపరి దీనికి సంబంధించి పౌరసరఫరాల క్షేత్రస్థాయి సిబ్బందికి రోజువారీ లక్ష్యం ప్రకారము వారి పరిధిలోని మిల్లుల నుండి సీఎంఆర్ డెలివరీలు చేయించాలని, ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అలానే ఎఫ్సీఐ అధికారులు సీఎంఆర్ గోడౌన్ లలో అవసరమైన స్థలాన్ని ఏర్పాటు చేయాలని మరియు ఎస్ డబ్ల్యూసి వారు గోడౌన్ నకు వచ్చు స్టాక్స్ దిగుమతి చేసుకొనుటకు సరిపడు హమలిలను సమకూర్చు కోవాలని ఆదేశించారు..ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరా అధికారి అండ్ జిల్లా మేనేజర్ పౌరసరఫరా సంస్థ ఇంచార్జ్ సి. వెంకటేశ్వర్ రావు, నాయబ్ తహశీల్దార్లు, పౌరసరఫరా క్షేత్రస్థాయి సిబ్బంది, మిల్లర్లు, తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ వ్యవసాయానికి డ్రోన్ వినియోగం

**అదిలాబాద్- ప్రభాత సూర్యుడు**

డ్రోన్.. ఇందు గలదు అందులేదు అన్న సందేహం లేదు.. ఎందెందు వెతికినా అందదు కలదు. అవును ఇప్పుడు గాల్లో చక్కర్లు కొట్టేందుకు ఈడ ఆడ అన్న తేడా లేదంటూ దూసుకుపోతోంది. పెళ్లిళ్లకు మాత్రమే పరిమితం అయిన డ్రోన్లు.. నా రూటే సపరేట్ అంటూ.. బహిరంగ సభలు, నాయకుల పాదయాత్రలతో మరింత వేగం పెంచింది.. అక్కడితో ఆగిపోతే అది డ్రోన్ ఎందుకు అవుతుంది.. తాజాగా సరిహద్దులు దాటి సైనికుల రంగంలోకి దిగింది. జవాన్ కోసం మాత్రమే కాదు తాజాగా జై కిషాన్ అంటూ నినదిస్తోంది. పంటల సాగు కు తోడ్పడుతూ.. మందుల పిచికారికి నేనుసైతం అంటూ అన్నదాతకు అండగా నిలుస్తోంది డ్రోన్.నిర్మల్ జిల్లా తానూర్ మండలం ఝరి (బి) గ్రామానికి చెందిన బాలాజీ అనే రైతు తన సోయా పంట కు డ్రోన్ ద్వారా పురుగుల మందు పిచికారి చేస్తూ భళా అనిపిస్తున్నాడు. వ్యవసాయ పనుల్లో ఆధునిక పద్ధతులు అవలంబిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు బాలాజీ. కూలీల కొరత, ఖర్చులు పెరగడంతో డ్రోన్ల ద్వారా మందులు పిచికారీ చేస్తూ ఎకరానికి మూడు వేల చొప్పున ఆదా చేయగలుగుతున్నారు. డ్రోన్ ను వాడటం ద్వారా ఒక ఎకరానికి కేవలం 450 రూపాయలు మాత్రమే ఖర్చు అవుతుంది. అంతేకాదు.. అఖీల రిలయన్స్ ఫౌండేషన్ ద్వారా కొంత ఆర్థిక సహాయం కూడా అందుతుంది. దీంతో ఆర్థిక కష్టాల నుండి అవలీలగా బయటపడ గలుగుతున్నానని చెప్తున్నాడు రైతు బాలాజీ. డ్రోన్ ద్వారా మందులు పిచికారి చేయడంతో ఇటు సమయంతో పాటు అటు కూలీల ఖర్చు కూడా కలిసి వస్తుందని రైతు బాలాజీ చెబుతున్నాడు.మందుల పిచికారికి 5 గురు కూలీలు చేసే పనిని డ్రోన్ ఒక్కటే చేస్తుంది. టైం కూడా 60 శాతం ఆదా అవుతోందని.. నీరు, మందు ఖర్చును, సమయాన్ని తగ్గించవచ్చని బాలాజీ చెప్తున్నాడు.

మొక్కలన్నింటికి సమానంగా మందును పిచికారి చేయవచ్చు. డ్రోన్‌కు అనుసంధానం చేసి స్మార్ట్‌ఫోన్ ద్వారా పొలంలో కావాల్సిన చోట డ్రోన్ కెమెరాను తిప్పుతూ ఫొటోలు కూడా తీయవచ్చని చెప్తున్నాడు రైతు బాలాజీ. మరోవైపు ఎరువుల్ని చల్లడం, వెద పద్ధతిలో విత్తనాలు వేయడానికి సైతం వినియోుగిుస్తుున్నానని తెలిపాడు బాలాజీ. మరోువైపు డ్రోన్లను వినియోగించి నేల స్వభావం తెలుుసుకోవడం ద్వారా నేలలో ఏయే పోషకాలు అవసురం, ఏ పోషకాలు అధికంగా ఉన్నాయి, ఉప్పు నేలలు, చౌడు, ఉరకెత్తు ప్రాంతాలను గుర్తించి వాటుికి అనుగుణంగా యాజుమాన్య పద్ధతులు చేపట్టేందుకు ఉపయోగుపడుతున్నాయని చెప్తున్నాడు రైతు బాలాజీ. బాలాజీ ఐడియాతో స్థానికంగా ఉన్న రైతులు సైతం సాగుకుసాయంగా డ్రోన్లను వాడేందుకు ముందుకొస్తున్నారు.డ్రోన్ టెక్నాలజీ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతోంది.

విత్తనాలు చల్లుకోవడం నుంచి ఎరువులు, పురుగు మందులు వేయుుడం, పంటల అంచనా, పంటలకు అందించాల్సిన పోషకాలు అందించడంతో పాుటు పలు అంశాల్లో ఈ టెక్నాలజీ ప్రయోజనకారిగా మారింది. రానున్న రోజుల్లో చిన్నపాటి డ్రోన్లను రైతులకు అందుబాటులోకి తెచ్చేలా కృషి జరుగుతోందని స్థానిక వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్తున్నారు.కూలీల కొరత తీవ్రమవటం, ఎరువులు, పురుగు మందు ధరలు పెరిగిపోవటం వల్ల నష్టపోతున్న రైతులకు ఈ డ్రోన్ ఊరట కల్పించడమే కాకుండా యువతరాన్ని రాబోయే కాలంలో వ్యవసాయం వైపు మరల్చడానికి ఈ టెుక్నాలజీ దోహదం చేస్తుందని శాస్త్రవేత్తలు చెబుుతున్నారు. షేడ్‌నెట్స్, గ్రీన్‌మ్యాట్ వంటి పద్ధతుల్లో పంటలు పండించే చోట గాలి ఎక్కుువగా తగలకపోవడం వల్ల పుప్పొడి ఒక పుష్పం నుంచి మరో పుష్పంపైకి చేరటం లేదు. పరపరాగ సంపర్కం జరుగక సమస్యలు తలెత్తుతున్నాయి. అరచేతిలో ఇమిడిపోయేంత డ్రోన్లను ఆ మొక్కుులుుపై తిప్పితే పరపరాగ సంపర్కం అవుతుం దని శాస్త్రవేత్తలు గుర్తించినట్టు తెలుస్తోంది. చూడాలి రాబోయో డిజిటల్ మాయ ప్రపంచంలో డ్రోన్ లు ఇంకెంత దూకుడుతో దూసుకెళుతాయో.. ఇంకెన్ని విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతాయో.

# ఎన్నో యేండ్ల కల నెరవేరింది

## మాజీ కౌన్సిలర్ ఇందుకూరి సూర్యప్రభ

కుత్బుల్లాపూర్ - ప్రభాత సూర్యుడు



ఎన్నో దశాబ్దాలుగాాళా లోకం ఎదురుచూస్తున్న మహిళా రిజర్వేషన్ కల నెరవేరిందని కుత్బుల్లాపూర్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్, బిఆర్ఎస్ పార్టీ నాయకురాలు ఇందుకూరి సూర్యప్రభ ఆనందం వ్యక్తం చేశారు. చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించడం సంతోషకరమని అన్నారు. దీని ద్వారా పార్టీ లేవైనా పార్టీ కోసం కష్టపడే ప్రతి మహిళను గుర్తించి, చట్టసభలకు వెళ్లేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. చిన్న కార్యకర్త నుండి పెద్ద లీడర్ వరకు ప్రతి మహిళా నాయకులను ప్రోత్సహించినట్టు అవుతుందని అన్నారు . అలాగే రాబోయే కార్పొరేటర్ ఎన్నికల్లో ఈ రిజర్వేషన్ అమలు చేస్తే బాగుంటుందని పేర్కొన్నారు.

# పేట్ బషీరాబాద్‌లో అన్నదాన కార్యక్రమము



**కుత్బుల్లాపూర్ - ప్రభాత సూర్యుడు :** వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని క్యాంటన్ పార్క్ ముందు ఏర్పాటు చేసిన గణనాథుని మండపం వద్ద గురువారం స్ట్రీట్ వెండర్స్ (రోడ్ సైడ్ దుకాణ సముదాయం ) ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్న ఈ మండపం వద్ద సుమారు 450 మంది గణనాథుని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గణేష్ మండప నిర్వాహకులు పైపుల అశోక్, అడ్వకేట్ రాకేష్ ఆర్ సాయిబాబా, శంకర్ , ప్రదీప్ వెంకటేశ్వర్లు , మండల నవీన్, రాజ్ కుమార్ ముదిరాజ్, నాయకులు సాదు గోపి, మనోజ్ , శ్రీధర్ , శ్రీను మరియు జాల రాము తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఉన్నత చదువుల కోసం

# బిఎన్ఆర్ ట్రస్టు అండ

## బిఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్ర శేఖర్ రెడ్డి



**యాచారం-ప్రభాత సూర్యుడు:** యాచారం మండలంలోని వివిధ గ్రామాల ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న 200 మంది పేద విధ్యార్థులకు ఉచిత బస్ పాసుల రుసుము ఆర్టీసి అధికారులకు గురువారం తన కార్యాలయంలో ఆర్టీసి అధికారికి అందజేశారు. ఈ సంవత్సరం మొదటి విడతగ జులై నెలలో 1000 మంది విధ్యార్థులకు బస్ పాసులు అందజేసిన విషయం తెలిసిందే, ఇంకా 200 మంది విధ్యార్థులు మిగిలిపోయారు అని నందివనపర్తి బి ఎన్ రెడ్డి ట్రస్టు చైర్మెన్ బిలకంటి చంద్ర శేఖర్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు . శేఖర్ రెడ్డి స్పందిస్తూ పేద విధ్యార్థుల కోసం వెంటనే వారికి బస్ పాసులు ఇవ్వాలని తెలిపారు . బిఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులకు, పేద ప్రజలకు సేవ కార్యక్రమాలకు ట్రస్టు ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమలులో వి హెచ్ పి ఏస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాళ్ళ జంగయ్య,మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు కొంగళ్ళ జోగిరెడ్డి,ఆర్టీసి అధికారి బాల మల్లేష్ పాల్గొన్నారు.

## దసరాకు సొంతూళ్లకు వెళ్లే వారికి టీఎస్ఆర్టీసీ శుభవార్త

### ముందస్తు టికెట్ బుకింగ్ చేసుకుంటే 10 శాతం రాయితీ

దసరాకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు శుభవార్త. ముందస్తు టికెట్ బుకింగ్ చేసుకునే వారికి 10 శాతం రాయతీ ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ఆర్టీసీ) నిర్ణయించింది. అక్టోబర్ 15 నుంచి 29 తేదీల మధ్యలో ప్రయాణానికి రానుపోనూ ఒకేసారి టికెట్లు బుకింగ్ చేసుకుంటే, తిరుగు ప్రయాణం పై 10 శాతం డిస్కౌంట్ కల్పిస్తున్నట్లు ప్రకటించింది. ఆయా తేదిల్లో ప్రయాణానికి ఈ నెల 30వ తేది వరకు ముందస్తు రిజర్వేషన్ చేసుకునే ప్రయాణికులకు మాత్రమే 10 శాతం రాయితీ వర్తిస్తుందని స్పష్టం చేసింది. రిజర్వేషన్ సదుపాయమున్న అన్నీ సర్వీసుల్లో రాయితీ అమల్లో ఉంటుందని పేర్కొంది. "బతుకమ్మ, దసరా చాలా పెద్ద పండుగలు. ఈ పర్వదినాలకు హైదరాబాద్ నుంచి ఎక్కువగా సొంతూళ్లకు వెళ్తారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ అనేక మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో ప్రజలకు ఆర్థిక భారం తగ్గించేందుకు 10 శాతం రాయితీని ఇవ్వాలని సంస్థ నిర్ణయించింది.

# 2300 డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పంపిణీ

■ డబుల్ బెడ్ రూంలను ప్రారంభించిన మంత్రులు, ఎమ్మెల్యే , మేయర్ ■ లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల అందజేత





అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండల పరిధిలో ఒకేరోజు మూడు వేరువేరు ప్రాంతాల్లో 2300 మందికి గురువారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ చేసింది. అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని తట్టి అన్నారం, కుత్బుల్లాపూర్, కుంట్లూరు హత్తిగుడలో నిర్మించినటువంటి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మంత్రులు పట్నం మహేందర్ రెడ్డి, మహమూద్ అలీ, మేయర్ గద్వాల విజయలక్ష్మి లతో కలిసి రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి 2300 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ప్రారంభించారు. పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధిలోని హత్తిగూడలో 432 డబుల్ బెడ్ రూంలను గనుల,భూగర్భ శాఖ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి కలిసి ప్రారంభించగా, తట్టి అన్నారంలో 1,268 హోం మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డిలు ప్రారంభించారు. అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని కుత్బుల్లాపూర్ తిమ్మయిగుడ గ్రామ పరిధిలో నిర్మించిన 600 డబుల్ బెడ్ రూంలను జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి కలసి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ప్రారంభించి, లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీల్లో ఇండ్లు లేని నిరుపేదలకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలన్న ధ్యేయంతో



ప్రభుత్వం పని చేసిందని, ఆ దిశగా ముఖ్యమంత్రి కేసీఆర్ కల సాకరమయ్యిందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# డబల్ బెడ్ రూమ్‌లు అర్హులైన స్థానికులకే పంపిణీ చేయాలి

## బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహా రెడ్డి

ఆదిభట్ల-ప్రభాత సూర్యుడు

మహేశ్వరం నియోజకవర్గంలోని మన్ సాన్ పల్లి గేటు వద్ద మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న డబల్ బెడ్ రూమ్ అభ్యర్థుల లక్కీ డ్రా నిర్వహించుండగా బిజెపి శ్రేణులు అడ్డుకున్నారు. దీంతో బిజెపి శ్రేణులను పోలీసులు అరెస్టు చేసి ఆదిభట్ల పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి మాట్లాడుతూ. మహేశ్వరం నియోజకవర్గంలోని అనేక గ్రామాలు మున్సిపాలిటీలో బీద ప్రజలు ఎంతో మంది ఉండగా, స్థానికులకు కేటాయించకుండా చార్మినార్ చంద్రాగుట్ట పురానాపూల్ అఫ్జల్గంజ్ ప్రాంతాల చెందిన కేవలం మైనార్టీ వర్గానికి కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. స్థానికులైన బీద ప్రజలకు డబల్ బెడ్ రూమ్ లు కేటాయించాలని లేదంటే అఖిల పక్షం బిజెపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాలు ఆందోళన నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఇన్చార్జ్ పాపయ్య గౌడ్, స్థానిక కౌన్సిలర్ పొట్టి రాములు, సిహెచ్ యాదయ్య , శ్రావణ్ కుమార్, కాసారం చంద్రయ్య,



కృష్ణా నాయక్ , ఎర్ర చంద్రమోహన్ , బొల్లిపాక శ్రీను ఆవుల యాదయ్య, గాజుల ఆనంద్, టి.ఆదిలక్ష్మి , ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

## అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

జయశంకర్ భూపాలపల్లి-ప్రభాత సూర్యుడు

జిల్లాలో మాదక ద్రవ్యాలు నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని తన చాంబర్ లో మాదక ద్రవ్యాల, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... యువత చెడు అలవాట్ల వైపు ఆకర్షితులైతే వచ్చే నష్టాలు, కుటుంబంలో మన తల్లి దండ్రులు, మన కుటుంబీకులు పొందే దుఃఖం వివరిస్తూ చెడు అలవాట్లకు మొదటి నుంచి దూరంగా ఉండేలా విస్తృత ప్రచారం కల్పించాలని అదనపు కలెక్టర్ అన్నారు. నేటి యువత రేపటి భావి భారత పౌరులని, వీరిలో కొంతమంది డ్రగ్స్ కు ఆకర్షితులైతే దేశ భవిష్యత్తు నాశనం అవుతుందని, దీనిని గుర్తించి డ్రగ్స్ వల్ల కలిగే విపరీత పరిణామాలపై అవగాహన పెంచుకొని దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ తో పాటు, గుట్కా, గంజాయి, మాదక ద్రవ్యాలు, సిగరెట్ మొదలగు చెడు అలవాట్లకు సైతం దూరంగా ఉండాలని, చెడు అలవాట్ల వల్ల ఆరోగ్యం దెబ్బ తింటుందని, ఆలోచనా విధానం, ఆలోచనా శక్తి నశిస్తాయని అన్నారు. భావితరాలు మాదకద్రవ్యాల పట్ల ఆకర్షితులు కాకుండా వారికి సమాజంలో మంచి, చెడు తెలియజేయాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో గంజాయి సాగు రవాణా జరగకుండా కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. విద్యాలయాలకు దూరంలో మద్యం షాపులు ఉండాలని, బెల్ట్ షాపులపై కంప్లైంట్ వస్తే మూసి వేయించి వారిపై చర్యలు తీసుకోవడం



జరుగుతుందని, స్కూల్ కు దగ్గర ఉన్న కిరాణా, పాన్ షాపులను తనిఖీ చేయాలని, అక్కడ సిగరెట్, పొగాకు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో మాదక ద్రవ్యాల వాడకం ఉన్న పిల్లలను బాధితులుగా పరిగణించి వారికి అవసరమైన కౌన్సిలింగ్ అందించాలని, దీని కోసం జిల్లాలో అందుబాటులో ఉన్న సైకాలాజిస్ట్ సేవలను విస్తృతంగా వినియోగించు కోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఉన్న విద్యా సంస్థల్లో విద్యార్థుల అలవాట్లను పరిశీలించాలని, మాదక ద్రవ్యాల వాడకం వల్ల వచ్చే నష్టాలను వివరించాలని ఆదేశించారు. జిల్లాలో అవసరమైన ప్రదేశాలలో అవగాహన కార్యక్రమాలను పోలీస్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేయాలని, మాదక ద్రవ్యాల నియంత్రణ చట్టం, జువైనల్ యాక్ట్ గురించి అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్పీ. రాములు, డి.పి.అర్. ఓ వి. శ్రీధర్, డి. ఈ. ఓ. రామ్ కుమార్, డ్రగ్ ఇన్స్పెక్టర్, కలెక్టరేట్ సి సెక్షన్ పర్యవేక్షకులు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215